

డీవైఎస్‌వోగా రాందాస్

సిరిసిల్లటౌన్: డీవైఎస్‌వోగా అజ్మీర రాందాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అడిష నల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను మర్యాదపూ ర్వకంగా కలవగా ఆయన అభినందించారు.



రాజన్న సన్నిధిలో టెండర్లు

వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనలో భాగంగా మంగళవారం చైర్మన్ చాంబర్‌లో ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యసేవలందించాలి



ఎన్‌క్వాస్ బృందంతో వైద్యసిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పీహెచ్ సీలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ సక్రమం గా చేపట్టాలని ఎన్‌క్వాస్ బృందం సభ్యులు డాక్టర్ సాజిత్ జోన్, డాక్టర్ రేణు భ్యానాలు అన్నారు. ఎన్‌క్వాస్ గుర్తింపు జాతీయ నాణ్యత ప్రమాణాల తనిఖీల్లో భాగంగా రెండో రోజు మంగళవారం బోయినపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రి రికార్డులు. సిబ్బంది తెలివితేటలు తదితర అంశాలు పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి విషయంలో పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఔట్, ఇన్ పేషెంట్ల విషయంలో శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగు లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుమన్‌మోహన్‌రావు, డీఐఓ డాక్టర్ మహేశ్, డీపీఓ ఉమ, పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు రేణుక, రేణు ప్రియాంక, జిల్లా క్వాలిటీ మేనే జర్ విద్యాసాగర్, సూపర్‌వైజర్ శశికుమార్, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో కుదిరిన కూలి ఒప్పందం



హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంప ల్లి-బద్దెనపల్లి టెక్స్ టైల్ పార్కులో పవర్ లూమ్ కార్మికులకు, యజమానులకు మంగళ వారం జరిగిన కూలి చర్చలు సఫలమైనట్లు సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లూమ్ కార్మికులకు బతుకమ్మ చీరల బ్లౌజ్ పీస్‌లకు కూలి పెంచాలని లేనిపక్షంలో జూలై 1న సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించామని అన్నారు. మంగళవారం యజమానులతో జరిపిన కూలి చర్చలు సఫలమై మీటర్ వస్త్రా నికి రూ.3 నుంచి రూ.3.70 పైసలు చెల్లించేం దుకు ఒప్పందం జరిగిందని తెలిపారు. కూలి చర్చల్లో సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జెల్ల సదానందం, కారంపురి మహేష్, శ్రీనివాస్, మహేశ్, టెక్స్‌టైల్ పార్కు యజమా నుల అధ్యక్షుడు అన్నల్దాస్ అనిల్, లక్ష్మీ నారాయణ, వేణు, లక్ష్మణ్, రాజేశం, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో రక్తదాన శిబిరం



సిరిసిల్ల డిపోలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్: టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం సిరిసి ల్ల ఆర్టీసీ డిపోలో మెగా రక్తదాన శిబిరం నిర్వ హించారు. డిపోలో పనిచేసే 40 మంది సిబ్బం ది రక్తాన్ని దానం చేశారు. ×ఒకరి రక్తదానం.. ముగ్గురికి ప్రాణం÷ కార్యక్రమంలో భాగంగా బ్లడ్‌బ్యాంపు నిర్వహించినట్లు డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ఎస్టీఐ సారయ్య, రాం రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ బీమాతో ధీమా

సిరిసిల్ల: పోస్టర్ బీమా పథకాలతో ఎంతో ధీమా లభిస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా పోస్టర్ అధికారి పెరుగు దయానంద్ అన్నారు. వేములవాడకు చెందిన కాసారపు తిరుపతిగౌడ్ పోస్టాఫీస్‌లో గతేడాది రూ.399 చెల్లించి బీమా చేయించుకున్నాడని, అతను ఇటీవలి కాలంలో ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలుకాగా ప్రమాద బీమా పాలసీ ద్వారా రూ.65వేలు ఆర్థిక సాయం మంజూరైందని తెలిపారు. ప్రమాద బీమా చెక్కును తిరుపతిగౌడ్‌కు అందించారు.


రేపు రాజన్న సన్నిధిలో తొలి ఏకాదశి వేడుకలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 29న ఆషాఢ తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరు పుకుంటున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఉదయం శ్రీస్వామి వారికి, అ నుబంధ దేవత లకు అభిషేకాలు, అర్చనలు, రుక్మిణి విఠలే శ్వర స్వామి వారలకు పంచోపనిషత్ ద్వారా అభిషేకాలు, సాయంత్రం 6.30 నుంచి మహా పూజ నిర్వహిస్తామన్నారు. ఇదేరోజు ఉద యం 5 గంటల నుంచి ఈనెల 30న ఉదయం వరకు అఖండ జన, హరికథలు, భక్తిసంగీతం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తదైన కొత్త మండలాల ఆశలు

- పల్లెల డిమాండ్‌ను పట్టించుకోని ప్రభుత్వం
- జగిత్యాల జిల్లాలో కొత్త మండలంగా బండలింగాపూర్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆవిరైన ఆశలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త మం డలాల ఆశలు ఆవిరయ్యాయి. జిల్లాలోని పలు గ్రామాలను మండలాలుగా ప్రకటిం చాలనే ప్రతిపాదనలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా జగిత్యాల జిల్లా లోని బండలింగాపూర్‌ను పది గ్రామాలతో కొత్త మండలంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయ గా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త మండలా ల ఆశలన్నీ ఉత్తవయ్యాయి. 37 ఏళ్ల కిందట మండల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్ప టికి పల్లెలు అనేక మార్పులకు గురయ్యాయి. పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం చిన్న జిల్లాలు, చిన్న మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త మండలాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు తెరపైకి వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు కు కొత్త మండలాలను ఏర్పాటు చేయాలనే విన తులు అందాయి. కానీ ఆ దిశగా చర్యలు తీ సుకోకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.





గాలిపల్లిలో గ్రామస్తుల నిరసన(ఫైల్)

- ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి వాసులు కొద్ది రోజులుగా గాలిపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తు న్నారు. నిజానికి ఇల్లంతకుంట మండల కేంద్రానికి గాలిపల్లి 7 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కానీ మండలాల్లో గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉంది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి స్వగ్రామంగా గాలిపల్లికి ప్రత్యేక గుర్తింపు. ఈనేపథ్యంలో గాలిపల్లి మండలాన్ని ప్రకటిం చాలని గతంలో గ్రామస్తులు ఆందోళనలు చేసి, సిరిసిల్లలో ప్రదర్శన నిర్వహించారు.
- తంగళ్లపల్లి మండలం జిల్లెల్లను మండల కేంద్రం చేయాలనే ప్రతిపాదన ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు సరిహద్దు గ్రామమైన జిల్లెల్ల కేంద్రంగా సమీప గ్రామాలను కలుపుతూ మండల కేంద్రంగా మార్చాలని కోరుతున్నారు. జిల్లెల్లను మండలం చేయా లని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

కొత్త మండలాల డిమాండ్లు ఇవీ..

- గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి మండల కేంద్రం చేయాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. గతంలో కొత్తపల్లి మండలం కోసం పాదయాత్ర లు, నిరహార దీక్షలు చేశారు. జిల్లా సరిహద్దు గ్రామంగా కొత్తపల్లికి గుర్తింపు ఉంది.
- వేములవాడ రూరల్ మండలాన్ని చెక్క పల్లి, నూకలమర్రి కేంద్రాల్లో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఆ రెండు గ్రామాల వారు మండల కేంద్రం కావాలని కోరుతున్నారు. చెక్కపల్లి వాసు లు ఏకంగా విరాళాలు సేకరించి మం డల కేంద్రం కోసం భూమిని కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. వేములవాడలో కొనసాగుతున్న రూరల్ మండలాన్ని చెక్కపల్లికి మార్చాలని కోరుతున్నారు.
- సిరిసిల్ల పట్టణంలో విలీనమైన ఏడు గ్రామాల వాసులు ఆ ఏడు గ్రామాలను కలిపి కొత్త మండలం చేయాలని కోరుతున్నారు. మున్సిపల్ విలీనం నుంచి తొలగించి గ్రామ పంచాయతీలుగా ఉంచాలని, కొత్త మండలం ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేశారు.
- కోనరావుపేట మండలంలోని బావుసాయి పేట, ధర్మారం వాసులు సైతం తమ గ్రామా న్ని మండల కేంద్రం చేయాలని కోరుతు న్నారు. 2016లో కొత్తగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటుతో రుద్రంగి, వీర్నపల్లి, తంగళ్ల పల్లి, వేములవాడ రూరల్ మండలాలు ఏర్పాటు అయ్యాయి. తొమ్మిది మండలాలను 13 మండలాలకు మార్చారు. పొరుగు జిల్లా లో కొత్తగా బండలింగాపూర్‌ను మండలంగా ప్రకటించగా కొత్త మండలాల ఆశలు అడి ఆశలయ్యాయి.

రూ.30లక్షలతో స్థలం కొన్నం



మా ఊరు మండల కేంద్రం కావాలని దాతల సహకారంతో రూ.30లక్షలతో మూడున్నర ఎకరాల స్థలం కొన్నం. వేము లవాడ రూరల్ మండలాన్ని చెక్కపెల్లికి మార్చాలని కోరుతున్నాం. అన్ని గ్రామా లకు మా ఊరు అందుబాటులో ఉంటుంది.

– ఎదపల్లి అనిల్, చెక్కపెల్లి

ఐదేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం



గాలిపల్లిని మండలం చేయాలని ఐదేళ్లుగా కోరుతున్నాం. అనేక సార్లు ఉద్యమించాం. అన్ని రకాలుగా గాలిపల్లికి మండల కేంద్రం గా మార్చే అర్హతలు ఉన్నాయి. గాలిపల్లి ఉద్యమాల చరిత్రను గుర్తించి ప్రభుత్వం మండల కేంద్రంగా మార్చాలి.

– అయ్యన్నగారి మహిపాల్‌రెడ్డి, గాలిపల్లి.

కొత్తపల్లిని మండలం చేయాలి



గంభీరావుపేట మండలంలో పెద్ద గ్రామం మాది. కొత్తపల్లిని మండల కేంద్రంగా మార్చాలని పాదయాత్రలు చేశాం. కామా రెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల మూడు జిల్లాల సరిహద్దులోని గ్రామం కావడంతో మా కొత్తపల్లిని మండల కేంద్రంగా మార్చాలి.

– గౌటే గణేశ్, కొత్తపల్లి

ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా

- రామగుండంలో తండ్రి కూతురిని అదుపులో తీసుకున్న ఏటీఎస్
- ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని ఆరోపణలు
- విచారణ నిమిత్తం హైదరాబాద్ తరలింపు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉగ్రవాదులతో సంబం ధాలు ఉన్నాయన్న అనుమానంతో గుజరాత్ పోలీసులు రామగుండంలో తండ్రీకూతురిని అదు పులోకి తీసుకోవడం కలకలం సృష్టించింది. ఇటీ వల శ్రీనగర్ కు చెందిన నలుగురు ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులను గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేశారు. వారిలో సమీరా బాను అనే మహిళతో తెలంగాణలో పలువురు చాటింగ్ చేసినట్లు గుర్తించిన ఏటీఎస్ పోలీసులు పాతబస్తీతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళ వారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న తండ్రి (40), కూతురు (20) నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలోని శ్రీనగర్ కాలనీలోని బం ధువుల ఇంట్లో షెల్టర్ తీసుకున్నారు. దీంతో గుజరాత్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రామగుండం సీపీ ఎదుట హాజరుపరిచారు. ఉగ్ర వాదులతో సంబంధాలపై విచారించినట్లు సమా చారం. మీకు సమీరా భాను ఎలా పరిచయం? ఎన్ని రోజుల నుంచి తెలుసు? వారితో ఏంచాట్ చాట్ చేశారు? తదితర అంశాలపై ప్రశ్నించి స్టేట్ మెంట్ రికార్డ్ చేశాక, హైదరాబాద్ తరలించారు.

జిల్లాలో చిరుజల్లులు

- చల్లబడిన వాతావరణం
- చందుర్తిలో అత్యధికంగా 5.6 మిల్లీ మీటర్ల వర్షం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. రెండు రోజులుగా తుంపర వానలు పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలో అత్యధికంగా చందుర్తిలో 5.6 మిల్లీ మీటర్ల వర్షం కురియగా.. అత్యల్పంగా ఇల్లం తకుంటలో 0.6 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలోని రుద్రంగిలో 3.5, వేములవాడ రూరల్‌లో 2.5, బోయినపల్లిలో 2.1, సిరిసిల్ల, వేములవాడల లో 1.9, కోనరావుపేటలో 4.7, వీర్నపల్లిలో 1.4, ఎల్లారెడ్డిపేటలో 1.3, గంభీరావుపేటలో 1.1, ముస్తాబాద్‌లో 1.2, తంగళ్లపల్లిలో 1.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీ.బీ.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో 45 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతం నెలకొంది.

వైద్యసేవలపై గ్రామసభలు

- ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ వైద్యశాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్యసేవలపై ప్రతినెలా మొదటి బుధవారం గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలు బాగా విస్తరించాయని, ప్రస్తుతం 63శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగు తున్నాయని, దానిని 80 శాతానికి పెంచాలన్నారు. గర్భిణుల్లో నమ్మకాన్ని పెంచేలా అందరూ కృషి చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రాథ మిక ఆరోగ్య కేంద్ర భవనాలను దసరా నాటికి పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఇంజినీర్లను ఆదేశిం చారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ మంగళ, శుక్ర వారం డ్రైడే నిర్వహించి డెంగీ, మలేరియా ప్రబల కుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్, స్ప్రేయిం గ్ చేయాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిం చాలని అన్నారు. కీటక జనిత వ్యాధులను క్షేత్రస్థా యిలో కట్టడి చేయాలని, దీనిపై నిత్యం నివేదిక అందించాలని వైద్యశాఖ అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి సుమన్‌మో హన్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, జిల్లా ఆస్పత్రి పర్యవేక్ష కుడు డాక్టర్ మురళీధర్‌రావు, వేములవాడ ఏరి యా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మహేశ్‌రావు, జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే



తిలకిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

వేములవాడరూరల్: వచ్చే ఎన్నికల్లో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో రూరల్ అధ్య క్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో మేరా భూత్ సబ్‌సే మస్బూత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రామకృష్ణ హాజరై మాట్లాడుతూ బీజేపీపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగిందని రాను న్నది మా ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, రేగుల సంతోష్ బాబు, లింగంపల్లి కిశోర్, వంశీ, పర్శరాం, మ ధు, పరమేష్, మల్లికార్జున్, వెంకటేశ్, అనిల్, బూ త్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: మహిళల రక్షణకు జిల్లా పోలీసు శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం గీతానగర్ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫ్‌డి ఫెన్స్ శిక్షణలో మాట్లాడారు. ఆపరేషన్ జ్వాల పేరిట జిల్లాలోని విద్యాలయాల్లో విద్యార్థినులకు స్వీయరక్ష ణ కోసం శిక్షణ అందించే శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థినులు స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవడం ద్వారా ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. జిల్లా లోని 113 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిక్షణకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మూడు నెలల పాటు సెల్ఫ్ డిఫెన్స్‌పై అనుభవం కలిగిన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల, వేముల వాడలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10 రో జులు శిక్షణ జరుగుతుందన్నారు. ఆకతాయిల బారి నుంచే కాకుండా చైన్ స్నాచింగ్, మహిళలపై లైంగిక దాడులు జరిగే క్రమంలో వారిని సమర్థవంతంగా తిప్పికొట్టడం లాంటి టెక్నిక్స్ నేర్పించడం కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రమేశ్, సీఐలు అనిల్‌కుమా ర్, ఉపేందర్, ప్రధానోపాధ్యాయులు బాగ్యారేఖ, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ పద్మజ, ఎస్సై శ్రీకాంత్, రమేశ్, రాజు, కరాటే మాస్టర్ మన్నాన్ పాల్గొన్నారు.

గల్ఫ్‌లో ఆగుతున్న గుండె

- వరుసగా వస్తున్న శవపేటికలు
- ఆందోళన చెందుతున్న కుటుంబాలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధితులు

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి లేక కొన్నే ళ్లుగా గల్ఫ్ బాట పట్టిన నిరుద్యోగ కూలీలు అక్కడ వివిధ కారణాలతో మృతి చెంది శవపేటికలో ఇంటి కి చేరుతున్నారు. కన్నవారిని కాదని భార్యపిల్లల ను వదిలి ఎన్నో ఆశలతో ఎడారి బాట పట్టిన కార్మికు లపై ఆశలు పెట్టుకున్న వారి కుటుంబాల్లో వివిధ కారణాలతో అక్కడ మృతి చెంది ఇంటికి శవమై రా వడంతో వారి రోదనలు ఆకాశాన్నంటుతున్నాయి.

పది రోజుల్లో వరుస సంఘటనలు

ఇటీవల గల్ఫ్‌లో వివిధ కారణాలతో మృతి చెందిన జిల్లాకు చెందిన కార్మికుల మృతి సంఘటనలు వారి కుటుంబాల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇక్కడ ఉపాధి లేక కొందరు వెళ్తే.. మరికొందరు కంపెనీపై ఉన్న నమ్మకంతో వెళ్తున్నారు. అలాంటి వారు కం



శవపేటిక వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు (ఫైల్)

పెనీలో విధులు నిర్వహిస్తూ గుండెనొప్పి రావడంతో మరణిస్తున్నారు. ఎడారి ప్రాంతంలో మరణిస్తున్న గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదు కోవాలంటూ ప్రతిఒక్కరూ కోరుతున్నారు.

మనోళ్ల సాయం

గల్ఫ్‌లో మృతి చెందుతున్న కార్మికుల మృతదే హాలను స్వదేశానికి పంపించేందుకు మనోళ్లు చేస్తున్న సహాయ సహకారాలు అంతా ఇంటా కాదు. వివిధ దేశాల్లో తెలుగువారు స్థిరపడి ఆర్థికంగా అక్కడ ఉండగా మన ప్రాంతం వారు చనిపోతే వారు స్వయంగా కంపెనీ యజమానులతో మాట్లాడి మృతదేహాలను పంపించేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. వేములవాడకు చెందిన తోట రాం కుమార్, గోలి మోహన్, ఎల్లారెడ్డిపేటకు చెందిన రాదారపు సత్యంతో పాటు ఎందరో ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

జిల్లా నుంచి ఎందరో కార్మికులు బతుకుదెరువు కోసం గల్ఫ్‌బాట పట్టారు. ప్రధానంగా మెట్ట ప్రాం తం ఉన్న ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం లేక వివిధ కారణాలతో గ్రామాలు వదిలి గల్ఫ్‌కు వెళ్తున్నారు. అక్కడ కంపెనీ ఇబ్బందులు, కుటుంబాల బాధ్యత లతో అకస్మాత్తు మరణాలు చెందుతున్నారు. అలాంటి వారి కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేములవాడ అర్బన్ మండలం కొడుముంజకు చెందిన నాగుల నర్సయ్య పదేళ్లుగా దుబాయ్ పోతున్నాడు. అక్కడ కష్టపడి తన ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాడు. విధి వెక్కించడంతో ఇద్దరు కూతుర్ల భర్తలు మృతి చెందారు. ఏమి చేయలేని పరిస్థితిలో పర్శయ్య మనోధైర్యంతో బిడ్డలను, భార్యను చూసుకునేందుకు అక్కడ కష్టపడుతు న్నాడు. అయినప్పటికీ విధి ఆయనను వెంటాడింది. వారం రోజుల క్రితం ఆయనకు గుండెనొప్పి రావడంతో తోటి స్నేహితులు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడే మృతి చెం దాడు. శవపేటిక మంగళవారం స్వగ్రామానికి చేరింది. చిన్న బిడ్డ స్వప్న అతడి చితికి నిప్పు పెట్టింది. ఇద్దరు బిడ్డలు, తల్లి ఒంటరిగా మిగిలారు. ఈ విషాద సంఘటన ఆ గ్రామంలో ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించింది.

వేములవాడలోని సుభాష్‌నగర్‌కు చెందిన దూలం రఘు కొన్నేళ్లుగా గల్ఫ్ దేశం పోతున్నాడు. ఆరు నెలల్లో స్వదేశానికి వచ్చి పెళ్లి చేసుకుంటానని తల్లితో మాట్లాడిన ఆయన అక్కడ విధులు నిర్వ హిస్తూ రోడ్డు దాటుతుండగా కారు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఆయన శవపేటిక ఇంటికి చేరింది. ఇలా కారణాలు ఏమైనా ఎన్నో ఆశలతో గల్ఫ్ బాట పట్టిన కార్మికుల బతులు గాలిలో కలుస్తున్నాయి. వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి కుటుంబాలు ఆశలు నెరవేరకముందే వారు అసువులు బారుతున్నారు.

కోనరావుపేట మండలం ధర్మా రంకు చెందిన మైలారం నర్సయ్య కొన్ని నెలలుగా బెహరన్ దేశానికి వెళ్తున్నాడు. సోమవారం బల్దియా లో పనిచేస్తుండగానే గుండెనొప్పి రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆయ నకు భార్య, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివయ్యగారి నవీన్ కొన్నేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నాడు. గతేదాది ఇండియాకు వచ్చి పెళ్లి చేసుకొని భార్యతో మళ్లీ గల్ఫ్‌కు వెళ్లాడు. పదిరోజుల క్రితం కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా గుండె నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేదు. తల్లిదండ్రులకు ఒకే కుమారుడు కాగా ఆయన మృతదేహంతో భార్య రావడం గ్రామంలో ప్రతిఒక్కరిని కలిచివేసింది. ఉన్న ఒక్క కొడుకు చనిపోవడంతో శవపేటికపై శివయ్య తల్లిదండ్రులు పడి అయ్యో కొడుకా.. మా బాగోగులు చూసుకుంటావనుకుంటే మా కళ్లముందే ఇంత పనిచేశావంటూ వారి రోధనలు అంతా ఇంతా కాదు.

నా వంతు సాయం చేస్తున్న..



వేములవాడ మండలం నూకలమర్రికి చెందిన నేను యూ ఎస్ఏలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు దాదాపు 8 దేశాల్లో 30 నుంచి 40 మంది మనోళ్లు వివిధ కారణాలతో మృతి చెంద గా నాకున్న సంబంధాలతో వారి మృతదేహాలను స్వదేశా నికి పంపించా. కంపెనీలో వచ్చే లాభాలతో పాటు నా వంతు సాయం అం దిస్తున్న. – డా.గోలిమోహన్, యూఎస్ఏ, ఎఫ్‌డీఏ అప్రూవ్డ్ బోర్డు సైంటిస్ట్

సహకారం అందిస్తున్న




దుబాయ్‌లో స్థిరపడిన నేను వీర్నపల్లి మండలం అడవి పదిరకు చెందిన వాడిని. ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ నాలాంటి కార్మికులకు కష్టాలు వస్తే నా వంతు సాయం అందిస్తున్న. నా గ్రామం, మండలం అని తేడా లేకుండా సహకారం అందిస్తున్న.

– రాధారపు సత్యం, ఎల్ఎస్‌పీఎమ్‌కే సంస్థల అధినేత, దుబాయ్

క్లుప్తంగా

వీధి కుక్కల దాడిలో జింక మృతి


మృతి చెందిన జింకను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ శివారులోని జక్కుల చెరువు ప్రాంతంలో మంగళవారం వీధి కుక్కల దాడిలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాపూర్ అటవీ ప్రాంతం నుంచి జింక దప్పిక తీర్చుకోవడానికి చెరువు వద్దకు వచ్చింది. అక్కడికి గుంపుగా చేరుకున్న కుక్కలు ఒక్కసారిగా జింకపై దాడి చేయడంతో తీవ్రగాయాలకు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందింది. గ్రామస్తులు అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావుకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులతో పాటు పోలీసులు, పశువైద్యాధికారులు ఘటన స్థలానికి వెళ్ల పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని పూడ్చి పెట్టారు.

ఇద్దరి రిమాండ్

వీర్నపల్లి: విధులకు ఆటంకపర్చిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్ చేసినట్లు ఎస్సై నవత తెలిపారు. కానిస్టేబుల్ రియాజ్‌పాషా, హోంగార్డు మహిపాల్‌లు భూ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదుపై మంగళవారం బాబాయిచెరువుతండాకు విచారణకు వెళ్లారని అన్నారు. తండాకు చెందిన అజ్మీర రాజు దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడని రియాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. అలాగే వీర్నపల్లి ఆంజనేయస్వామి ఆలయ గోపురంపై ఇత్తడి శిఖరాన్ని దొంగిలించిన శంకర్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వివరించారు.

రాజన్న సన్నిధిలో టెండర్లు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనలో భాగంగా మంగళవారం చైర్మన్ చాంబర్‌లో ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. శివపురం దుకాణం నంబర్ 11ను రూ.4.65 లక్షలకు ఎల్.చంద్రశేఖర్, నం.29ను రూ.1.80 లక్షలకు నవీన్, నం.30 దుకాణంను రూ. 1.80 లక్షలకు పులి మల్లేశం, కరీంనగర్ దుకాణం నం.22–1ను రూ.3.50 లక్షలకు జి.ఇందిర, ఖాళీ నూనె, కాజు డబ్బాలు కాలపరిమితి ఒక సంవత్సరం కోసం రూ.26 చొప్పున పి.నాగరాజుకు అప్పగించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హరికిషన్, పర్యవేక్షకుడు గోలి శ్రీనివాస్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

'ఏరువాక' సందడి


వరి మొలకలను మడిలో చల్లుతూ..


పదిర గ్రామంలో మడిలో నారు వేస్తూ..


ట్రాక్టర్‌తో మడిని నేర్పుతూ..

వర్షపు చినుకుల రాకతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. జిల్లాలోని పలు మండలాల్లో ఏరువాక సాగు పనులు ముమ్మరం చేశారు. దుక్కులు సిద్ధం చేసిన రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. పొలాల్లో ఎక్కడ చూసిన కూలీల సందడి కనిపిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా


వరినారు పీకుతూ..


నాట్లు వేస్తున్న మహిళలు

ఈ'సారీ'.. సర్దుకుపోవుడే!

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీ
- సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థుల ఇబ్బందులు
- భాషా పండితులది అదే పరిస్థితి
- గతేడాది లాగే ఈసారీ సర్దుబాటుకు ఆదేశాలు

జిల్లాలో ఇలా..

జెడ్పీ ఉన్నత పాఠశాలలు	113
ప్రాథమికోన్నత పాఠశాలలు	37
ప్రాథమిక పాఠశాలలు	489
విద్యార్థుల సంఖ్య	48,081


ఈ చిత్రంలో కనిపిస్తున్న స్కూల్ ముస్తాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల. ఇక్కడ 305 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇది సక్సెస్ స్కూల్ కూడా. నిబంధనల మేరకు 19 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా 10 మంది పనిచేస్తున్నారు. సక్సెస్ స్కూల్ కూడా కావడంతో ఆంగ్లం, తెలుగు విద్యార్థులకు ఒకేచోట బోధన చేస్తున్నారు. ఇంగ్లిష్, మ్యాథ్స్ టీచర్లు కావాల్సి ఉంది. ఎస్సెస్సీలో ఉన్న 84 మందికి ఒకేచోట తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టలేకపోతున్నామని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇలా గంభీరావుపేట మండలం ముచ్చర్ల జెడ్పీ స్కూల్‌లో మ్యాథ్స్, సైన్స్ బోధించే టీచర్లు లేరు. అలాగే ఇదే మండలం కొత్తపల్లిలో ముగ్గురు మ్యాథ్స్ టీచర్లు ఉన్నారు. ఒకచోట అదనంగా, మరోచోట అసలు ఉపాధ్యాయులు లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు సిలబస్ ఎవరు చెప్తారని ఆందోళన చెందుతున్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యా సంవత్సరం ఆరంభమైంది. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీతో కొన్ని పీరియడ్లు విద్యార్థులు ఖాళీగానే కూర్చుంటున్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ముగిశాయి. విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇన్ని చేసినా ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో డిప్యుటేషన్లు వేయకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై పక్షం రోజులైనా డిప్యుటేషన్లు వేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత విద్యా సంవత్సరం లాగే డిప్యుటేషన్లతో సర్దుబాటు చేస్తామని చెప్పుతున్న అధికారులు ఈ సంవత్సరం ఇంకా ఆ ప్రక్రియ ప్రారంభించలేదని తెలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 372 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇందులో 126 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు తరగతులు జరగడం లేదు. నూతన ఉపాధ్యాయ నియమకాలు ఇప్పుడు జరిగే అవకాశం లేనందున డిప్యూటేషన్లపైనే విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు

జిల్లాలో 372 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో స్పష్టంగా ఉంది. జీవో 317తో బదిలీలు, రిటైర్‌మెంట్లతో పోస్టులు ఖాళీ అయ్యాయి. పీజీ హెచ్ఎం పోస్టులు 51, స్కూల్ అసిస్టెంట్లు గణితం 24, భౌతికశాస్త్రం 08, బయోలజిక్ సైన్స్ 32, సోషల్ 48, ఇంగ్లీష్ 23, ఉర్దు 01, తెలుగు 12, హిందీ 11, ఫిజికల్ డైరెక్టర్ 04, పీఈటీ 04, భాషా పండితుల్లో తెలుగు 06, ఉర్దు 01, హిందీ 06 ఖాళీగా వున్నాయి. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎం పోస్టులు 51 ఖాళీలున్నాయి. ఎస్‌జీటీ పోస్టులు 63, ఉర్దు 03, డ్రాయింగ్ మాస్టర్లు 05, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లు 11, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు 09 ఖాళీగా వున్నాయి. రిటైర్‌మెంట్లు, 317 జీవో బదిలీలు, అప్‌గ్రేడ్ అయిన స్కూళ్లు, ఇంగ్లిష్ మీడియంలోకి మారిన స్కూళ్ల నేపథ్యంలో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే స్కావెంజర్లు, అటెండర్లు, స్వీపర్ల పోస్టులు ఖాళీగా వున్నాయి. స్కావెంజర్లు లేక పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులే గంట కొట్టడం, ఇతర పనులు చేస్తున్నారు.

చదువులో వెనుకబడుతాం


పాఠాలు చెప్పే సార్లు లేకపోతే చదువులో వెనుకబడుతామని భయపడుతున్నాం. ఖాళీగా ఉన్న టీచర్ల స్థానంలో వేరే బడుల టీచర్లు వెంటనే పంపిస్తే బాగుంటుంది. కొన్ని పీరియడ్లు ఖాళీగానే ఉండాల్సి వస్తుంది. ఇప్పటికైనా సార్లు స్పందించి టీచర్లను డిప్యూటేషన్లపై పంపించాలి.

– కావేటి రేణుశ్రీ, పదోతరగతి

టీచర్ల నియామకాలు చేపట్టాలి


టీచర్ల నియమకాలు లేక ఎనిమిదేళ్లయింది. టెట్ నిర్వహించడం, టీచర్ రిక్రూట్‌మెంట్ చేయకపోవడం జరుగుతోంది. తక్షణమే టీచర్ల రిక్రూట్‌మెంట్లను చేపట్టాలి. విద్యార్థులు నష్టపోకుండా వెంటనే డిప్యూటేషన్లు చేయాలి. విద్యారంగం అభివృద్ధికి అధికారులు మరింత కృషి చేయాలి.

– పాతూరి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకుడు

ఎంఈవోలను ఆదేశించాం


జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ల స్థానంలో ఇతరులకు డిప్యూటేషన్లు ఇవ్వాలని ఇప్పటికే ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. పాఠశాలల్లో అదనంగా పనిచేస్తున్న వారికి డిప్యూటేషన్లు ఉంటాయి.

– రమేశ్, జిల్లా విద్యాధికారి

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి


డీఈవోకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులో 100 శాతం రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కాంబోజి ముత్యం ఆధ్వర్యంలో మంగళవారం డీఈవోకి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజానికి సేవ చేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో వంద శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్, జగదీశ్, కోశాధికారి గంగు సతీశ్, గంప రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లేగదూడపై చిరుత దాడి


లేగ దూడ మృతదేహం

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండా గ్రామం మైసమ్మలొద్ది ఏరియాలో లేగ దూడపై చిరుత దాడి చేసి చంపినట్లు గ్రామస్తులు తెలిపారు. మూడ నాజంకు చెందిన లేగదూడను తన వ్యవసాయ పొలం వద్ద సోమవారం రాత్రి కట్టివేశాడు. చిరుత పులి లేగదూడపై దాడి చేయగా మృతి చెందిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేయాలని గ్రామస్తులు కోరారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. కాదంటున్నాడు

- న్యాయం కోసం అత్తింటి ఎదుట వివాహిత నిరసన


స్తంభంపల్లిలో అత్తింటి ఎదుట బైఠాయించిన వివాహిత

బోయినపల్లి(చొప్పదండి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను కాదంటూ వేధింపులకు గురి చేయడంపై న్యాయం చేయాలని మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో ఓ వివాహిత అత్తింటి ఎదుట మంగళవారం నిరసనకు దిగింది. స్తంభంపల్లికి చెందిన ప్రదీప్, వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన కావేరిలు ఐదేళ్లుగా ప్రేమించుకుని ఇటీవల వివాహం చేసుకున్నారు. పెళ్లి ఇరువురి పెద్దలకు ఇష్టం లేదు. అనంతరం అత్తింటి వారు ఇంటికి రానివ్వక పోవడంతో కొన్నిరోజులు వేములవాడలోని రామతీర్థపు కాలనీలో నివాసం ఉన్నారు. గత కొద్ది రోజులుగా భర్త వేధించడంతో న్యాయం చేయాలని అత్త ఇంటి ఎదుట కావేరి బైఠాయించి నిరసన తెలిపింది. విషయం తెలుసుకున్న బోయినపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు కావేరితో మాట్లాడి సర్దిచెప్పి పంపారు. కాగా ఈ విషయంలో కావేరి ఇచ్చిన ఫిర్యాదుపై వేములవాడ పీఎస్‌లో వరకట్న వేధింపుల కేసు ఇప్పటికే నమోదు అయినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలాగే కావేరిపై ఆమె అత్త పద్మ సైతం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీలను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ కలెక్టరేట్‌కు వచ్చి తమ సమస్యను మీడియాతో వెల్లబోసుకున్నారు. ప్రతినెలా 5వ తేదీలోపు టీఏ, డీఏ, ఇంటి అద్దెలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలను వివరిస్తూ కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రాన్ని అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మమత, మంజుల, ఉజ్వల, రేణుక, రాజేశ్వరి, కనుకవ్వ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం


పోలీస్‌స్టేషన్‌లో వీరంగం చేస్తున్న రెడ్డి, గట్టయ్యలు

వేములవాడ: నిత్యం రోడ్డుపై వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు మంగళవారం రాత్రి పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండు వద్ద ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. వివరాల్లోకి వెళ్తే చందుర్తి మండల కేంద్రానికి చెందిన దండుగుల రెడ్డి, గట్టయ్యలు మద్యం మత్తులో వాహనం నడుపుతూ తిప్పాపూర్ బస్టాండుకు చేరుకున్నాడు. దీంతో పోలీసులు బ్రీత్ అనలైజర్ చేశారు. తనను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ పోలీసులపై తిరగబడ్డాడు. ఈక్రమంలో పోలీసులు జీపులో ఎక్కించి ఠాణాకు తీసుకొస్తున్న క్రమంలో జీపు అద్దాలు పగులగొట్టడమే కాకుండా హోంగార్డు రామరాజును కొరికాడు. ఠాణాకు చేరుకున్న రెడ్డి, గట్టయ్యలు చంపేస్తాం, నరికేస్తాం అంటూ పోలీసులపైకి విరుచుకుపడ్డారు. ట్రాఫిక్ ఎస్సై దిలీప్‌కుమార్ తన విధులకు ఆటకం కలిగించిన దండుగుల రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. గాయపడ్డ రామరాజును ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించామన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే తప్పకుండా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


అతీక్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ అతీక్(25) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం ఎల్లారెడ్డిపేటకు తీసుకొచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. అతీక్ ఆరు నెలల క్రితం ముంబైకి వెళ్లి అక్కడే కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న ముంబై నుంచి కామారెడ్డికి రైలులో ప్రయాణం చేశాడు. మంగళవారం తెల్లవారుజామున కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో పట్టాలపై తీవ్ర గాయాలతో పడి ఉండటాన్ని గమనించిన రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుటుంబసభ్యులు సమాచారం అందుకొని మృతదేహాన్ని ఎల్లారెడ్డిపేటకు తరలించారు. చిన్న వయస్సులోనే అతీక్ అనుమానాస్పదంగా మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు అవివాహితుడు. కడు పేదరికం అనుభవిస్తున్న కుటుంబం కావడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థికసాయం కోసం అర్థిస్తున్నారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని స్థానిక మైనార్టీలు కోరుతున్నారు.

కోర్టుకు అత్యాచారం నిందితులు

కరీంనగర్‌క్రైం: బాలికపై అత్యాచారం కేసులో నిందితులను మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. బాలికపై ఐదుగురు బాలురతో పాటు ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు సోమవారం బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై పోక్సో, అత్యాచారం, బెదిరింపులకు సంబంధించిన కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పరచగా.. ఐదుగురు బాలురను జువైనల్ హోంకు, యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేని రెండు ప్రైవేటు పాఠశాలలు సీజ్


పాఠశాలను సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారి వెంకటస్వామి

సిరిసిల్లటౌన్: అనుమతి లేకుండా నడుస్తున్న రెండు కార్పొరేట్ పాఠశాలలను సిరిసిల్ల విద్యాశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. పట్టణంలోని శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలకు ఎలాంటి అనుమతులు లేవని ఏబీవీపీ విద్యార్థులు ఆందోళన చేపట్టి డీఈవో రమేశ్, ఎంఈవో రఘుపతిలకు ఫిర్యాదు చేశారు. డీఈవో ఆదేశాల మేరకు సిరిసిల్ల విద్యాశాఖ అధికారి వెంకటస్వామి ఇరు పాఠశాలలను సీజ్ చేశారు. ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ మారవేని రంజిత్, ప్రకాశ్, రాజు, కార్తీక్, శివ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల సుభాష్‌నగర్‌లోని కార్మిక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అనుమతి లేని ఆస్పత్రులు, అర్హత లేని టెక్నీషియన్స్‌తో నడిపిస్తున్న ల్యాబ్‌లు, ఫార్మాసిస్టులు లేని మెడికల్ షాపులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. జనరిక్ మందులకు అడ్డగోలుగా బిల్లులు వేస్తున్నారని తెలిపారు. అమాయక ప్రజలను అడ్డగోలుగా దోచుకుంటున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పంతం రవి, అజ్జ వేణు, సోమ నాగరాజు,రాజేందర్,మల్లయ్యతదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


పోలీసులకు పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాలు

చందుర్తి(వేములవాడ): నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేశ్ తెలిపారు. మండలంలోని నర్సింగాపూర్‌లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు ఓ వ్యక్తి వచ్చాడన్న సమాచారం మేరకు గ్రామశివారులో తనిఖీ చేస్తుండగా మర్రిగడ్డకు చెందిన నేరెళ్ల రాజబాబు వద్ద 10 కిలోల పత్తి విత్తనాలు లభ్యమయ్యాయని అన్నారు. రాజబాబును అదుపులోకి తీసుకొని విచారించగా మర్రిగడ్డకు చెందిన సాంబశివారెడ్డి తనకు పత్తి విత్తనాలు ఇచ్చాడని తెలిపారు. సాంబశివారెడ్డి ఇంటి ఆవరణలో పత్తి విత్తనాల కోసం సోదాలు చేయగా ఎలాంటి విత్తనాలు లభ్యం కాకపోవడంతో రాజబాబు ఇచ్చిన సమాచారం మేరకు సాంబశివారెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈమేరకు రాజబాబు, సాంబశివారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. సాంబశివారెడ్డిని చందుర్తి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.